క్లుప్తంగా

బాలికల గురుకుల పాఠశాల పరిశీలన



నరసాపురం(విస్సన్నపేట): మండల పరిధి నరసాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుహాసిని శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, జ్వరాలు ఎవరికైనా ఉన్నయా అని అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో భోజనశాలను, వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉన్నదా లేదా, వంట చేసేవారు పరిశుభ్రత పాటిస్తున్నారా లేదా పరిశీలించారు. ఆహారం వండే విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి కె. శ్రీనివాసరావు, డాక్టర్ అశ్వినీదత్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల, సబ్ యూనిట్ ఆఫీసర్ బాబావలి, సూపర్‌వైజర్ వీరభద్రరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా దినోత్సవం



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో శుక్రవారం క్విట్ ఇండియా దినోత్సవాన్ని షిర్డీ సాయి బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 1942 ఆగస్టు 8న మహాత్మాగాంధీ బ్రిటిష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టేందుకు చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమ ప్రాముఖ్యతను సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణరావు విద్యార్థులకు వివరించారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న నేతల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ ప్రదర్శించి వారి పోరాట గాధను తెలిపారు. సమరయోధులకు సేవా కమిటీ సభ్యులు నివాళులర్పించారు.

డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి



చాట్రాయి: చిత్తపూరు తూర్పు దళితవాడలో డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు చాట్ల బాబూరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి దళితవాడలో నిలిచిన వర్షం నీటి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షం కురిస్తే కాలనీలో కురిసిన నీరు డ్రెయినేజీ లేక గృహాల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నిలిచిన నీటితో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు పరిశీలించి కాలనీలో డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

నక్కా జమలమ్మకు నివాళి



ముసునూరు: వైఎస్సార్ సీపీ నాయకురాలు నక్కా జమలమ్మ (46) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె గత పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుగా చెక్కపల్లి సర్పంచ్ పదవికి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆమెకు భర్త, కుమార్తె ఉన్నారు. నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పలువురు పార్టీ నేతలు జమలమ్మ కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 9వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

నరకానికి నకళ్లు

- అడుగడుగునా గుంతలు
- రాకపోకలకు గ్రామస్తుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



చొప్పరమెట్ల-సగ్గూరు రోడ్డుపై గుంతలు

ఆగిరిపల్లి: మండలంలోని చొప్పరమెట్ల-సగ్గూరు జెడ్పీ రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా అంతే సంగతులు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నా ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

అడుగడుగునా అధ్వానం..

30 ఏళ్ల క్రితం నిర్మించిన సగ్గూరు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా తయారైంది. ప్రభుత్వం, అధికారులు ఈ రహదారిపై దృష్టి పెట్టడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు కిలోమీటర్లు ఉన్న రహదారిలో సుమారు 100 చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఈ గ్రామానికి చెందిన వారు ఎవరికైనా ప్రమాదమో, అనారోగ్యమో సంభవించి 108కి ఫోన్ చేస్తే ఆ వాహనం రాలేని దుస్థితి. ధ్వంసమైన ఈ రహదారిలో ఆటోవాలాలు రావాలంటే హడలెత్తిపోతున్నారు. రహదారి ఛిద్రం కావడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. అనేకమంది రోడ్డుపై ఉన్న గుంతల్లో పడి గాయాలబారిన పడ్డారని, తమ వాహనాలు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు చొప్పరమెట్ల నుంచి సగ్గూరు వెళ్లే రహదారి నిర్మించాలని అధికారులను కోరినా ప్రయోజనం లేకపోయిందని సగ్గూరు, కృష్ణవరం, కొమ్మూరు, సురవరం గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారుల నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్తులు వాహన చోదకులు కోరుతున్నారు.

రోడ్డును అభివృద్ధి చేయాలి



రహదారి ధ్వంసమై ఏళ్లు గడిచినా అధికారులకు చీమకుట్టినట్లుగా కూడా లేదు. పంచాయతీలో తీర్మానం చేసి అధికారులకు నివేదిక కూడా పంపాము. రహదారి మరమ్మతులు గానీ, నిర్మాణం కానీ జరగలేదు. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలి.

– ఎస్ఎస్ దిలీప్ కుమార్, సర్పంచ్, సగ్గూరు

ప్రయాణం నరకం



సగ్గూరు–చొప్పరమెట్ల రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకం కనబడుతోంది. రహదారిపై గోతులు పడి అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. గుంతలు తప్పించబోయి ద్విచక్ర వాహన చోదకులు కింద పడిపోతున్నారు. అధికారులు స్పందించి నూతన రోడ్డును నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– అల్లాడి కనకయ్య, కృష్ణవరం, గ్రామస్తుడు

మండుతున్న ఎండలు.. ఎండుతున్న చెరువులు



ఎండిపోయిన బూరుగుగూడెంలోని బొల్లి కుంట చెరువు

చాట్రాయి: మండుతున్న ఎండలకు ఖరీఫ్ సాగు కష్టంగా మారుతోంది. ఈ ఖరీఫ్‌లో ఆశించిన స్థాయిలో వర్షం కురవకపోవడంతో మండలంలోని అన్ని చెరువుల్లో నీరు లేని పరిస్థితి నెలకొంటోంది. అడపాదడపా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు రైతులు వరి నాట్లు పూర్తి చేశారు. జూలై రెండవ వారం నుంచి ఆగస్టు మొదటి వారం వరకు కాస్తున్న ఎండలకు నీరు లేక వరి పొలాలు బీటలు వారుతున్నాయి. వేసవిని తలపిస్తున్న ఎండలకు భూ గర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో బోర్ల కింద వేసిన వరి సాగుకు సరిపడా సాగు నీరు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికి పొలాల్లోని పైర్లకు తేమ శాతం పెంచుతుంది కానీ నీరు నిల్వ ఉండని పరిస్థితి నెలకొంది. వేసవిలో కురిసిన వర్షాలు వర్షాకాలంలో కురవకపోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మాదిగల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు

మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టిబాబు మాదిగ



సమావేశంలో పాల్గొన్న దండు వీరన్న మాదిగ

ఆగిరిపల్లి: ఆంధ్ర మాదిగల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టిన వ్యక్తి మంద కృష్ణ మాదిగ అని మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు చిట్టిబాబు మాదిగ విమర్శించారు. ఆగిరిపల్లి షాదీఖానాలో శుక్రవారం ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యకర్తల రౌండ్ టేబుల్ సమావేశం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మంగళపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దండు వీరన్న మాదిగ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ద్వారా అక్కడి మాదిగలు వర్గీకరణ ఫలాలను అనుభవిస్తున్నారన్నారు. చంద్రబాబు మాదిగలకు ఆరు శాతం రిజర్వేషన్ ఇవ్వడంపై పునరాలోచించాలని, ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ ద్వారా కాకుండా, పార్లమెంట్ లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. చిట్టిబాబు మాదిగ మాట్లాడారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ కృష్ణా జిల్లా ఇన్‌చార్జిగా కొదముల గంగాధర్, ఏలూరు జిల్లా ఇన్‌చార్జిగా ఉదయగిరి కృపారావు, నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా కంబాల ప్రదీప్, ఆగిరిపల్లి మండల కన్వీనర్‌గా పెనుముచ్చు కమలాకర్ ఎన్నికయ్యారు.

దళితులపై దాడులు చేయడం అనాగరిక చర్య



తొమ్మండ్రు రాజేశ్వరరావును పరామర్శిస్తున్న నాయకులు

నూజివీడు: దళితులపై దాడులు చేయడం అనాగరిక చర్య అని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు ఖండించారు. నూజివీడు మండలం జంగంగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త తొమ్మండ్రు రాజేశ్వరరావు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడని టీడీపీ కార్యకర్తలు కొందరు నాలుగు రోజుల క్రితం రాజేశ్వరరావుపై దాడి చేశారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీకి చెందిన దళిత నాయకులందరూ గురువారం రాత్రి జంగంగూడెంలోని రాజేశ్వరరావు ఇంటికి వెళ్లి అతనిని పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అధికారం ఉందని దళితులపై దాడులకు దిగితే సహించేది లేదని హెచ్చరించారు. తుక్కులూరు సర్పంచి తొమ్మండ్రు బుజ్జి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కంభాల రాంబాబు, పులపాక ఆశీర్వాదం, ప్రత్తిపాటి జోజి, దొండపాటి కిశోర్, ముల్లంగి జమలయ్య, బేతాళ చింతయ్య, పొట్లూరి వాసు, తొమ్మండ్రు మధుసూదనరావు, అచ్చియ్య, పున్నం సత్యం తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మైలవరం: సాగర్ జలాలతో చెరువులు నింపాలని రైతు సంఘం మైలవరం మండల అధ్యక్షుడు రావుల సుబ్బారావు, కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మైలవరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సాగర్ జలాలను విడుదల చేయడం వలన మైలవరం నియోజకవర్గంలోని పలు చెరువులను నీటితో నింపవచ్చని, తద్వారా రైతులు వేసిన పంటలకు నీటి ఎద్దడి ఉండదన్నారు. సరైన వర్షాలు కురవకపోవడంతో చెరువులు నిండక రైతులు వేసిన పంటలు ప్రారంభంలోనే ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. సాగర్ జలాలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, వృధాగా పోతున్న సాగర్ జలాల విషయంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టి సారించి చెరువులు నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వజ్రాల ధనలక్ష్మి, చిలుకూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



నూజివీడు: సీఐటీయూ ఏలూరు జిల్లా 13వ మహాసభలను సెప్టెంబరు 4, 5, 6 తేదీల్లో నూజివీడులో నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా నాయకుడు జి.రాజు తెలిపారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. పట్టణంలోని పెనుగొండ ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించే మహాసభలకు జిల్లా వ్యాప్తంగా 400 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. సీఐటీయూ నాయకులు ఎస్ఆర్ హనుమాన్లు, పాలేటి సుభాష్‌చంద్రబోస్, పుట్టి కమల, జి. వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి, జయలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ వెంకయ్య స్వామి టెంపుల్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు ఎండోమెంట్ ఆఫీస్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఆఫీస్, వాసవి మెడికల్ కాంప్లెక్స్, మురళి ఐస్ ప్లాంట్, నార్త్ ఫేజ్ అపార్ట్‌మెంట్, లాంకో కాలనీ, జీఐజీ స్కూల్, వర్టెక్స్ రెడీమిక్స్ కంపెనీ, మురళీకృష్ణ టింబర్ డిపో ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

శ్రీనివాస నగర్ కంటైనర్ సబ్ స్టేషన్ పరిధిలో..

శ్రీనివాస నగర్ కంటైనర్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు పంట కాలువ రోడ్డు, సాహితి విల్లాస్, వెంకయ్య స్వామి టెంపుల్ రోడ్డు, ఎండోమెంట్ ఆఫీస్, వాసవి ఫార్మా మెడికల్ కాంప్లెక్స్, అభినందన అపార్ట్‌మెంట్, కృష్ణ-గోదావరి బ్లాక్ అపార్ట్‌మెంట్, రావూరి వెంచర్స్ అపార్ట్‌మెంట్, జీఐజీ స్కూల్, ల్యాంకో కాలనీ, మురళీకృష్ణ టింబర్ డిపో, రాధామాధవ్ టింబర్ డిపో, శ్రీనివాస నగర్, కోయపేట, అనిల్ క్యాస్టల్ అపార్ట్‌మెంట్, వన్ సెంటర్, సాయిపురం కాలనీ, ఎల్ఐసీ కాలనీ, జైన్ కాలనీ, బైపాస్ రోడ్డు, అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు, శ్రీశైలం కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

- **మైలవరం:** మైలవరం మండలం గణపవరం, వెల్వడం గ్రామాల్లోని విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ సీహెచ్ రామమోహనరావు తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు.

వరాలియ్యవమ్మా వరలక్ష్మీ



విస్సన్నపేట కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు



తిరువూరు కనక దుర్గాలయంలో కరెన్సీ అలంకరణలో అమ్మవారు

తిరువూరు: శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తిరువూరులోని వేంకటాచలస్వామి దేవస్థానం, రాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి ఆలయం, అష్టలక్ష్మీ దేవస్థానం, సంతోషిమాత ఆలయం, షిర్డీసాయి మందిరాలలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. తిరువూరు శాంతినగర్‌లోని కనక దుర్గాలయంలో అమ్మవారిని కరెన్సీతో అలంకరించారు. ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని పలు దేవాలయాల్లో సామూహిక కుంకుమార్చనలు, అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు.

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి అన్ని ఆలయాల్లో కుటుంబ సమేతంగా పూజలు చేశారు. ఆరుగొలనుపేట అంకమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

- **ముసునూరు:** మండల వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు జరుపుకున్నారు. పూజల అనంతరం వాయినాలు అందించారు.
- **ఆగిరిపల్లి:** మండలంలో భక్తులు వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

నూజివీడు: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని ఆలయాలన్నీ మహిళలతో కిటకిటలాడాయి. మహిళలు ఇంటి వద్ద వరలక్ష్మీ వ్రతం నిర్వహించుకుని ఆ తరువాత పట్టణంలోని శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ అలివేణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- **విస్సన్నపేట:** మండలంలో మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. పలు ఆలయాల్లో అమ్మవారికి కుంకుమార్చనలు, విశేష పూజలు జరిగాయి. స్థానిక ద్వారకానగర్‌లోని కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో, గణపతి, కుమారస్వామి, నాగేంద్ర స్వామి, అంకమ్మ తల్లి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నూజివీడులోని కోటమహిషాసురమర్దని అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆరుగొలనుపేటలోని మహాలక్ష్మమ్మ, అంకమ్మ వార్లకు పూజలు



దుగ్గిరాలలో బాలరావమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో వాసన్ కంటి ఆస్పత్రి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని చెప్పారు.

రాఖీ సందడి



విస్సన్నపేట: రాఖీ పండుగ సందర్భంగా సోదరులకు రాఖీలు కట్టేందుకు మహిళలు రాఖీలు కొనుగోలుకు దుకాణాలకు చేరుకున్నారు. రూ. 20 నుంచి రూ. 1,000 వరకు మోడల్స్‌ను బట్టి రాఖీలను విక్రయించారు. స్వీట్లు, పూలు, పండ్ల దుకాణాల వద్ద సందడి నెలకొంది.

నూతన హాజరు విధానంపై శిక్షణ

నూజివీడు: ఉపాధి హామీ పథకంలో మోసాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నూతన హాజరు విధానంపై నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు శుక్రవారం నూజివీడు మండల పరిషత్ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ముఖ ఆధారిత హాజరు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఉదయం పనికి రాగానే ఒకసారి ముఖ ఆధారిత హాజరు వేయాలని, మళ్లీ మధ్యాహ్నం మరోసారి హాజరు వేయాలని, రెండోసారి హాజరు వేసేటప్పుడు ఎవరైనా వ్యక్తి మారితే వారి హాజరు తీసుకోదని రీసోర్స్ పర్సన్‌లు వివరించారు. ఉపాధి హామీ పథకం నిర్వహణలో మస్టర్ల అక్రమాలను లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన సామర్థ్య పెంపుదల విభాగం ప్రోగ్రామ్ అధికారి కె.స్వరూపరాణి పరిశీలించారు.

రాజ్యలక్ష్మీదేవికి కుంకుమ పూజ



తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రావణ మాసం సందర్భంగా సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో రాజ్యలక్ష్మీ దేవికి కుంకుమ పూజ, అభిషేకం జరిగాయి. వేణుగోపాలస్వామిని, అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

కట్టెలేరుకు వరద ఉధృతి

నిలిచిన రాకపోకలు



గంపలగూడెం మండలం కట్టెలేరు వంతెన వద్ద వరద ఉధృతి



వినగడప వద్ద వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్న పోలీసులు

తిరువూరు: గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టెలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో శుక్రవారం వాహనాల రాకపోకలను నిలిపివేశారు. గంపలగూడెం-విజయవాడ మార్గంలో వినగడప వద్ద కట్టెలేరుపై గతంలో వరదలకు కొట్టుకుపోయిన వంతెన స్థానంలో కొత్తది నిర్మించకపోవడంతో తాత్కాలిక రహదారిపైనే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వరదలకు ఈ తాత్కాలిక రహదారిపై సైతం రాకపోకలకు వీలులేకపోవడంతో పోలీసులు వంతెన వద్ద పహారా కాస్తున్నారు. గత రెండు రోజులుగా ఎగువున ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కట్టెలేరుకు వరద నీరు చేరుతోంది.